
ప్రజాశక్తి
శుక్రవారం 17 అక్టోబర్ 2025 5
పార్వతీపురం మన్యం



ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం : జెసి

పార్వతీపురం : 2025-26 ఖరీఫ్ సీజనులో ధాన్యం కొనుగోలుకు ఇప్పటి నుంచే సన్నద్ధత కావాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్ల సంసిద్ధతపై తహశీల్దార్లు, వ్యవసాయాధికారులు, గ్రామ వ్యవసాయాధికారులతో జెసి గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజనులో రైతుల నుంచి 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ అంచనాగా నిర్ణయించామన్నారు. 17శాతం లోపు తేమ ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాధారణ రకానికి క్వింటాకు రూ. 2,369, గ్రేడ్-ఏ రకానికి రూ.2,389 ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఏ ఒక్క రైతుకీ సమస్య లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, డిఆర్ఒ కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ ఆర్.దిలీప్ చక్రవర్తి , పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ అధికారి కె.శ్రీనివాసు, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి పాల్గొన్నారు.

వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేస్తున్న పాలకులు

- స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాల్సిందే
- జిల్లాలో నీటి వనరులున్నా అందని పరిస్థితి
- ఏపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

ప్రజాశక్తి - పాలకొండ

వ్యవసాయ రంగం రోజురోజుకు నిర్వీర్యం కావడానికి పాలకుల విధానాలేనని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ విమర్శించారు. గురువారం మన్యం జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మహాసభ గాయత్రి కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సూర్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యేలు నెలకు రూ.5 లక్షల వరకు జీతాలు తీసుకుంటూ రైతు వ్యతిరేక చట్టాలు చేస్తున్నారని విమర్శించారు. దేశంలో ఏడాదికి 72 లక్షల మంది రైతులు వ్యవసాయాన్ని వదిలి వెళ్లిపోతున్నారన్నారు. సోమనాథ్ కమిషన్ రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని చెప్పినప్పటికీ ఇంతవరకు ఆచరణలో లేదన్నారు. వ్యవసాయాన్ని రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపన్నుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన పత్రంలో వ్యవసాయానికి 60 శాతం మంది రైతులు అవసరం లేదని 10 శాతం మంది ఉంటే చాలనడమే ఇందుకు నిదర్శనమన్నారు. మన్యం జిల్లాలో పుష్కలంగా నీటి వనరులున్నా, రైతులకు నీరందకపోవడం అన్యాయమన్నారు. ఇక్కడ పాలకులు వైఫల్యమేనన్నారు. సర్వేల పేరుతో రైతులు భూములు తప్పులు తడకలు రికార్డుల్లో నమోదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. గతంలో జగన్మోహన్ రెడ్డి చేసిన సర్వేను మళ్లీ ఈ ప్రభుత్వం చేస్తుందన్నారు. కావున రైతులంతా ఐక్యమై సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో రైతులకు అనుకూలంగా పరిస్థితుల్లేవన్నారు నీటి వనరులున్నప్పటికీ ప్రాజెక్టులు పూర్తి చేయడం లేదన్నారు. కాలువలు మరమ్మతులు చేసే పరిస్థితి కూడా లేదన్నారు. ఈ ప్రాంతంలో గల జంఝావతి ప్రాజెక్టు 50 ఏళ్లు అయినా పూర్తి కాలేదన్నారు. పాలకుల అవసరాలకు అనుకూలంగా పనులు జరుగుతాయి తప్ప ప్రజలు, రైతుల సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. కావున ఈ సమస్యలపై రైతులంతా ఐక్యంగా పోరాటాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.మోహన్‌రావు, జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, ఉపాధ్యక్షులు బంటు దాసు, గేదెల సత్యనారాయణ, సహాయ కార్యదర్శి రవీంద్ర పాల్గొన్నారు. తొలుత సంఘం జెండాను సీనియర్ రైతు నాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ ఆవిష్కరించారు. అమరుల స్థూపానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి, ప్రతినిధులు నివాళ్లు అర్పించారు.

పట్టణంలో ర్యాలీ

రైతు సంఘం జిల్లా మహాసభల సందర్భంగా పట్టణంలో కోటదుర్గ ఆలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఉత్తేజ భరితమైన పాటలతో ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎం.తిరుపతిరావు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటరమణ, ప్రజానాట్యమండలి నాయకులు ఈశ్వరరావు, అభ్యుదయ రైతు కందాపు ప్రసాదు, మాజీ ఎంపిటిసి సభ్యులు కాగు చిట్టిబాబు, నేదేడ బిక్క ప్రసాదు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు



మహాసభలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ

తీర్మానాలు

మహాసభలో రైతు సమస్యలు, ప్రధానంగా సాగునీటి సమస్యపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. వంశధార వరద గోడ నిర్మాణం చేయాలని, తోటపల్లి ఎడమ కాలువ ఆధునీకరణ చేయాలని, పూర్తి చేయాలని జంఝావతి కాలువల నిర్మాణం చేపట్టాలని, జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సాగునీటి సమస్యలు పరిష్కరించాలని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై భవిష్యత్తు కార్యాచరణ ఏకగ్రీవంగా రూపొందించుకున్నారు.

రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా కృష్ణమూర్తి, దాసు





మహా సభ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. జిల్లా అధ్యక్షులుగా ఎం.కృష్ణమూర్తి, కార్యదర్శిగా బంటు దాసు, కోశాధికారిగా గేదెల సత్యనా రాయణ, సహాయ కార్యదర్శిగా కె.రవీంద్ర, ఉపాధ్యక్షులుగా బి.అప్పారావు, బి.గౌరీనాయుడు ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా ఎం.గోవిందరావు, ఆర్.సత్యనారాయణ, ఎం.వెంకటరమణ, బి.నాగభూషణరావు, ఆర్.అప్పలస్వామి, ఈల గౌరమ్మతో పాటు 19 మందితో కూడిన నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

ఎంత కష్టం... ఎంత కష్టం

- ఉపాధి కోసం వలస వెళ్లి అదృశ్యం
- ఆర్నెల్ల తర్వాత ఆచూకీ లభ్యం
- జమ్ములో ఉన్నట్టు పోలీసుల ద్వారా ఫోన్ సమాచారం
- రప్పించేందుకు సహకరించాలని కోరినా కనికరించని అధికారులు



కూలి కోసం... కూటి కోసం... పట్టణంలో బతుకుదామని... తల్లి మాటలు చెవిన పెట్టక... బయలుదేరిన బాటసారికి ఎంత కష్టం... ఎంతకష్టం... అన్నాడు మహాకవి శ్రీశ్రీ. ఆకలి రాజ్యం సినిమాలోని ఆ గేయం వలస కూలీల కష్టం కళ్లముందు కనిపిస్తున్నట్లుగా ఉంటుంది. అచ్చంగా ఓ అమాయక గిరిజనుడి జీవితం కూడా అందుకు అద్దం పడుతోంది. జీవన పోరాటంలో పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం యర్రడ్డవలస గిరిజన గ్రామంలోని కొండదొర తెగకు చెందిన బడ్నాన చిన్నారావు ఆరు నెలల క్రితం అదృశ్యమయ్యాడు. నెలరోజుల క్రితం జమ్ము ప్రాంతంలోని బనిర్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆచూకీ లభించింది. అక్కడి నుంచి తమవాడిని రప్పించాలంటూ కుటుంబ సభ్యులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ వారిలో ఇసుమంత కనికరం కనిపించలేదు. దీంతో, ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

యర్రడ్డవలస గిరిజన గ్రామానికి చెందిన బడ్నాన సిపాయి, చిన్నమ్మకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు చిన్నారావు పోడు వ్యవసాయం, సమీపంలోవున్న పెద్దగెడ్డలో చేపలవేటతో కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. ఇటీవలకాలంలో వ్యవసాయం కలిసిరావడం లేదు. చేపల వేటపై వచ్చిన ఆదాయం కుటుంబ పోషణకు సరిపోయే పరిస్థితి లేదు. దీంతో, కుటుంబాన్ని ఎలా పోషించాలో అర్థం కాని పరిస్థితి. మరోవైపు బొత్తిగా అమాయకత్వం. ఉపాధి కోసం ఎక్కడికైనా వెళ్లాలనుకునేవాడు. ఈ తరుణంలోనే ఎనిమిది నెలల క్రితం శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ద్వారా టుంగుటూరు ప్రాంతంలో రొయ్యల చెరువుల్లో పనిచేసేందుకు వెళ్లాడు. అక్కడ ఏం కష్టం వచ్చిందో? పుట్టిపెరిగిన గిరిజన ప్రాంతపు మట్టివాసనకు దూరంగా ఉండలేకపోయాడో? వెళ్లిన రెండు నెలల తరువాత అదృశ్యమయ్యాడు. దీంతో, తీసుకెళ్లిన వ్యక్తి చిన్నారావు కనిపించడం లేదంటూ తల్లి చిన్నమ్మకు సమాచారం పంపాడు. కొడుకు కనిపించడం లేదన్న వార్తతో చిన్నమ్మ గుండె చెరువైంది. ఉన్నంతలో వెతకని చోటులేదు. బంధువులు, స్నేహితుల గ్రామాల్లో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో, తల్లి మంచం పట్టింది. మరోవైపు సోదరుడు జోగారావు గంపెడు ఆశతో నాటి నుంచి వెతుకుతునే ఉండేవాడు. కానీ, ఊరుగాని ఊరులో తప్పిపోవడం వల్ల ఎక్కడ వెతకాలో తెలియని పరిస్థితి. తీవ్ర మనోవ్యధకు గురైన ఆ తల్లి మనసులో ఎక్కడో ఆశ. తన కొడుకు ఎప్పటికైనా తిరిగివస్తాడనే ఆ ఆశ గుండెకు ఒకింత నిబ్బరాన్ని ఇచ్చింది. ఆశ, నమ్మకం అయితే ఉందిగానీ ఆచూకీ మాత్రం నెలలు గడుస్తున్నా లభించలేదు. అంతలోనే ఓ రోజు తెల్లవారు జామును మండల కేంద్రమైన పాచిపెంట పోలీస్ స్టేషన్ నుంచి పిలుపు వచ్చింది. ఎందుకో ఏమిటో.. తన కొడుకు ఆచూకీ ఏమైనా లభించిందా? అన్న ఆశతో మరోకొడుకు జోగారావుతో కలిసి వెళ్లింది. వీరితో బంధువులు కూడా కలిసి వెళ్లారు. అంతలోనే తీపి కబురు. 'మీ కొడుకు చిన్నారావు ఆచూకీ లభించింది. జమ్ము అనే కేంద్ర పాలిత ప్రాంతంలో ఉన్నట్టుగా మాకు సమాచారం అందింది. ఇదిగో ఫొటో చూడండి. ఇతనేనా మీ కొడుకు' అంటూ స్థానిక పోలీసులు ఫోటో చూపించారు. దీంతో ఆ తల్లి ఆనందానికి అవధులు లేవు. జమ్ము ప్రాంతంలోని బనిర్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వున్నట్టుగా సోహన్ సింగ్ అనే పోలీస్ అధికారి ద్వారా వచ్చిన సమాచారంతో కుటుంబమంతా ఒకింత ఊపిరి పీల్చుకుంది.

కానీ, అక్కడికి వెళ్లాలంటే వీరికి తెలుగు తప్ప ఇతర భాషలు రావు. జమ్ము వెళ్లాలంటే ఎలా బయలుదేరాలో, ఎక్కడ ఏ ట్రైన్ ఎక్కాలో కూడా చిన్నారావు కుటుంబానికి తెలియని పరిస్థితి. పైగా ఆర్థిక స్తోమత కూడా అంతంత మాత్రం. ఈ రెండు కారణాలతో ఆ కుటుంబం అచేతనంగా ఉండిపోవాల్సిన పరిస్థితి. విషయం తెలుసుకున్న ఏపి గిరిజన సంఘం నాయకులు కె.రామస్వామి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. వీరి నాయకత్వంలో బాధిత కుటుంబం నెలరోజుల క్రితమే అప్పటి జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌కు పలుమార్లు విన్నవించి, తమ కుమారుడ్ని రప్పించేందుకు ఏర్పాటు చేయాలని కోరుకున్నారు. ఇదుగో అదుగో అన్నారే తప్ప మాట నిలబెట్టుకోలేదు. ఈలోపు కలెక్టర్ కూడా మారిపోయారు. మరోవైపు బాధితులకు అధికారులపైనా నమ్మకం సన్నగిల్లడం, ఆర్థిక ఇబ్బందులు వంటి కారణాలతో ఇప్పటి వరకు తిరిగి కొత్త కలెక్టర్ ఎం.ప్రభాకర్‌రెడ్డిని కలవలేకపోయారు. మరోవైపు పోలీసులు కూడా ఆచూకీ సమాచారం ఇవ్వడానికే పరిమితమయ్యారు. ఈనేపథ్యంలో జిల్లా కలెక్టర్, ఎస్పీలు జోక్యం చేసుకుంటే తప్ప చిన్నారావు సురక్షితంగా ఇక్కడికి చేరే అవకాశం లేదు. చిన్నరావు కోసం ఆయన తల్లి చిన్నమ్మ కళ్లు కాయలు కాసేటట్టు ఎదురు చూస్తోంది. 'నా కొడుకు ఎక్కడ ఉన్నాడో? ఎలా ఉన్నాడో? తిన్నాడో లేదో? అన్న బెంగతో కాలం గడుపుతోంది. ఇప్పటికైనా అధికారులు కనికరిస్తారో లేదో వేచి చూడాల్సిందే.

పిల్లల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - పార్వతీపురం

వసతి గృహాల్లోని విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జాయింట్ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో వసతి గృహ విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై జెసి సమీక్షా సమావేశం నిర్వహించారు. పిల్లల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారులకు, సహాయ గిరిజన సంక్షేమాధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలను జారీ చేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ హాస్టళ్లలోని పిల్లలకు పీహెచ్‌సీ వైద్యాధికారుల ద్వారా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరికీ హెల్త్ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అనుమానస్పదంగా ఉన్న, గుర్తించిన కేసులకు సకాలంలో చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని, కేసులను ఆలస్యం చేయకుండా ఉన్నత ఆసుపత్రులకు సూచించాలని పేర్కొన్నారు. అలాగే ప్రతి హాస్టల్‌ను పరిశుభ్రత, పారిశుధ్యాన్ని నిర్వహించాలని, వంటశాలలు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలని, సురక్షితమైన తాగునీటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హాస్టళ్లలో వ్యాధుల నివారణకు అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉంచుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖాధి కారులు సమన్వయంతో పిల్లలు ఆరోగ్య సంరక్షణను సమర్థవంతంగా అమలుచేయాలని, పటిష్ట పర్యవేక్షణ ఉండాలని, ఇందుకు అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎ.విజయశాంతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి జి.నాగభూషణరావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్లు, పీహెచ్‌సీ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, ఎటిడబ్ల్యూఒలు, పాల్గొన్నారు.

గురుకులంలో మౌలిక వసతులు : కలెక్టర్

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల ఆశ్రమ బాలికల పాఠశాలకు కావాల్సిన అన్ని మౌలిక వసతులను కల్పిస్తామని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధులు రూ. 30 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన 40 బాత్రూమ్‌లను స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరితో కలిసి కలెక్టర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో తక్షణమే కిచెన్ రూమ్‌కు ఫ్లోరింగ్ వేసి, అక్కడ వృథా నీటిని కాలువలోకి వెళ్లేలా పైప్ లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ప్రతి గదికి ఫ్యాన్లు, లైటింగ్ సాయంత్రంలోగా ఏర్పాట్లు చేయాలని ఐటిడిఎ ఎఇ, డిఇలను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ఐటిడిఎ ఇఇ బి.రామకృష్ణ, డిఇ సన్యాసయ్య పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించకుండా పాఠశాలను ఎలా ప్రారంభిస్తారు

జెసిని నిలదీసిన గిరిజన సంఘం నాయకులు

పాఠశాలలో మౌలిక వసతులు కల్పించకుండా పాఠశాలను ఎలా ప్రారంభిస్తారని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కూరంగి సీతారాం జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డిని ప్రశ్నించారు. స్థానిక గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. వీరితో పాటు వచ్చిన జెసిని ఉద్దేశించి సీతారాం మాట్లాడుతూ కేవలం మరుగుదొడ్లను ప్రారంభించి విద్యార్థులను పాఠశాలకు పంపమని తల్లిదండ్రులకు ఒత్తిడి చేయండి సమంజసం కాదన్నారు. పచ్చకామర్లతో ఇద్దరు విద్యార్థులు మరణించగా, 170 మంది విద్యార్థులు చికిత్స పొందగా నేటికీ ఇంకా కొంతమంది విద్యార్థులు చికిత్స పొందుతున్నారన్నారు.



జెసికి సమస్యలను వివరిస్తున్న గిరిజన సంఘం నాయకులు సీతారాం

రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే, గురుకుల సెక్రటరీ అనేక బృందాలు పర్యటించి వెళ్లారు తప్ప పాఠశాలలో సమస్యలేవీ పరిష్కరించలేదన్నారు. కొత్తబోరు ఏర్పాటు చేయాలని, సెప్టిక్ ట్యాంకు శుభ్రపర్చమని, కొత్త ఫ్యాన్లు, కిటికీలకు మెస్సలు వేయమని కలెక్టర్ నేరుగా చెప్పిగా నేటికీ సమస్యలు పరిష్కరించకుండా పాఠశాలను ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. తక్షణమే పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అప్పుడే విద్యార్థులను పాఠశాలకు పంపిస్తామని లేనిచో విద్యార్థుల ప్రాణాలకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలని డిఆమాండ్ చేశారు. లేకుంటే తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రతి విద్యార్థి ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా అడిగి తెలుసుకోవాలని జిల్లా ఆర్.బిఎస్.కె అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు స్పష్టం చేశారు. మండలంలోని రావికోన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ముందుగా సిక్ రూమ్, సిక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. అక్కడ జ్వర లక్షణాలతో ఉన్న విద్యార్థి ఆరోగ్య స్థితి, అందజేస్తున్న చికిత్సా వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. పూర్తిగా కోలుకునే వరకు నిశితంగా పర్యవేక్షణ చేయాలని వార్డెన్, వైద్య సిబ్బందిని ఆదేశించారు. సిక్ రిజిస్టర్‌లో అనారోగ్య సమస్యలు, ప్రారంభ, కోలుకునే తారీఖు, చికిత్సా వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. హాస్టల్ ప్రాంగణం పరిశీలించారు. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. వైద్య సిబ్బంది విద్యార్థులకు నిర్వహించిన హెల్త్ స్క్రీనింగ్ వివరాలు రికార్డులో పరిశీలించారు. రోగ లక్షణాలు గుర్తించిన వారికి ఖచ్చితంగా నిర్ధారణ జరిపి చికిత్స వెంటనే అందజేయాలన్నారు. అనంతరం ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను విద్యార్థులకు వేయించారు. పలు ఆరోగ్య అంశాలపై ఐఇసితో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె. సింహాన్నదొర,సూపర్వైజర్ జయగౌడ్,వార్డెన్ గౌరీశంకర్ , వైద్య సిబ్బంది ఊర్మిళ,భారతి తదితరులు పాల్గొన్నారు.


వర్షాలకు దెబ్బతిన్న పత్తి

ఆందోళనలో రైతులు

పరిహారం కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి - కొమరాడ

ఆరుగాలం అన్నదాత కష్టపడి శ్రమించి పండించిన పంట చేతికి వస్తున్న సమయంలో ప్రకృతి కన్నెర్ర చేయడంతో ప్రతిసారి రైతు నష్టపోతున్న విషయం చూస్తూనే ఉన్నాం. ఈ ఖరీఫ్ సీజన్లో వరి పంటకు ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ఆ రైతులు ఊపిరి పీల్చుకున్నప్పటికీ పత్తి రైతుకు తుఫాన్ రూపంలో తీవ్రంగా నష్టపరిచే పరిస్థితి ఏర్పడింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఇటీవల మండలంలో ఏకధాటిగా వర్షం పడడంతో పత్తి పూర్తిగా తడిసిపోవడంతో పంట నష్టం ఏర్పడింది. ఈ సీజన్లో గత మూడు నెలలుగా తుఫాన్లు అధికంగా ఉండడంతో అనేక విధాలుగా పంటలు నష్టపోయి రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో అధికంగా మెట్ట ప్రాంతంలో పత్తి సాగు ఎక్కువగా సాగవుతుంది. మండలంలో రైతుల కన్నా కౌలు రైతులే అధికంగా పత్తి సాగు చేస్తున్నారు. పత్తి సాగుతో ఎక్కువ ఆదాయం వస్తుందని ఆశపడ్డ రైతులకు ఈ ఏడాది నిరాశే మిగిలింది. వరుస తుఫానులతో పత్తి మొక్క దశ నుంచి కాయకాసి పొట్ట విడిచి పెడుతున్న సమయంలో విస్తారంగా వర్షాలు పడడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. మండలంలో దాదాపుగా 15 వేల ఎకరాల వరకు పత్తి సాగవుతున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నాయి. మండలంలోని విక్రమపురం, అర్థం, గుణా నపురం, దుగ్గి, కల్లికోట, గంగిరేగువలస, స్వామినాయుడు వలస, గుమడ, కోటిపాం, కొమరాడ, దేవుకోన, చొళ్లపదం, తదితర మైదాన ప్రాంతాలతో పాటు గిరి శిఖరం ప్రాంతాలైన పూడేసు, మసిమండ, లంజి, కుంతెసు తదితర గ్రామంలో అధికంగా పత్తి సాగవుతుంది. గిరిజన ప్రాంతాల్లో ఎకరాకు రూ.30 వేల వరకు మదుపులు పెట్టి సాగు చేస్తున్న రైతులకు ఈ వర్షాలతో నష్ట పోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా పత్తి కొనుగోలుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో రంగు మారిన, కుళ్లిపోయిన పత్తిని కొనుగోలు చేసేవారే ఎవరున్నారని రైతులు దినాస్థితిలో బాధపడే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి పత్తి కొనుగోలు చేయాలని, నష్టపోయిన పంటకు పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.



భారీ వర్షాలకు నేలకొరిగిన పత్తిపంట

అన్ని వసతులతో తాడికొండ జలపాతం

జిల్లాలోని జలపాతాలన్నీ అందుబాటులోకి తెస్తాం

జలపాతాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్, ప్రభుత్వ విప్

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

మొగనాలి (తాడికొండ) జలపాతం సకల సౌకర్యాలతో సిద్ధమై పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. పర్యాటక రంగంతో గిరిజన యువతకు ఉపాధి లభించనుందని, గిరిజన మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. మొగనాలి జలపాతాన్ని కలెక్టర్‌తో పాటు ప్రభుత్వవిప్, స్థానిక ఎమ్మెల్యే టి.జగదీశ్వరి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జలపాతానికి పూజలు చేసి, హారతిని ఇచ్చి తొలి టికెట్ ను కలెక్టర్ కొనుగోలు చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన బైక్ ర్యాలీకి జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడకు విచ్చేసే పర్యాటకులకు సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల ఇప్పటి వరకు ఇది పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రాలేదన్నారు. ప్రస్తుతం పర్యాటకులకు కావాల్సిన ప్రాథమిక సౌకర్యాలతో పాటు స్నాక్స్, ఆహారం, టీ-షర్ట్స్, షార్ట్స్, స్థానికంగా లభించే పండ్లు ఇవన్నీ కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. త్వరలో ఇక్కడ అడ్వెంచరస్ స్పోర్ట్స్, నేచురల్ క్లైంబింగ్ రాక్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడుతూ తాడికొండ వాటర్‌ఫాల్‌కు అన్ని రకాల సౌకర్యాలను జిల్లా యంత్రాంగం కల్పించిందని, ఇందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇక్కడకు విచ్చేసే పర్యాటకులకు సంబంధించిన అన్ని వస్తువులు లభించేలా శ్రీకారం చుట్టారని అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఇది మంచి అవకాశమని, త్వరలో మిగిలిన జలపాతాలు కూడా అందుబాటులోకి రానున్నాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, అధికారులు, స్థానిక సర్పంచ్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, మండలవాసులు తదితరులు పాల్గొన్నారు.



జలపాతాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే జగదీశ్వరి

విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి- సాలూరు

ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ప్రతి ఒక్క విద్యార్థి ఆరోగ్యం పట్ల సిబ్బంది ఎప్పటికప్పుడు శ్రద్ధ వహించాలని వారు ఏ విధమైన అనారోగ్యం బారిన పడినా తక్షణమే దగ్గరలోనున్న ఆసుపత్రికి తీసుకెళ్లి సరైన చికిత్స అందించాలని డిఇఒ రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని మామిడిపల్లి, అంటివలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను సందర్శించిన ఆయన హాస్టల్లో మరుగుదొడ్లు, వంటగదులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని వసతి గృహాన్ని కూడా శుభ్రంగా ఉంచి విద్యార్థులకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. అనంతరం మామిడిపల్లి పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి వారి ఆరోగ్య సమస్యలను స్థానిక వైద్యులను అడిగి తెలుసుకున్నారు.



మృతి చెందిన విద్యార్థుల ఫొటోలతో నిరసన తెలుపుతున్న నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం తీరు మార్చుకోవాలి

మృతి చెందిన గిరిజన విద్యార్థుల ఫొటోలతో ధర్నా

పార్వతీపురం : గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా, బాధ్యత లేకుండా వ్యహరిస్తోందని,తీరు మార్చుకోకుంటే తీవ్రంగా పరిగణిం చాల్సి ఉంటుందని పలువురు నేతలు హెచ్చరించారు. ఈ మేరకు మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మృతి చెందిన గిరిజన విద్యార్థుల ఫోటోలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవి కుమార్, బిఎస్‌పి పార్టీ నాయకులు పి.శివ ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు తీల్ల గౌరీ శంకర్ రావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఇవి నాయుడు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి.సంగం తదితరులు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ విద్యా సంస్థల్లో గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన విద్యా సంస్థల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి గిరిజన సంక్షేమ శాఖ విద్యా సంస్థల్లో గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, ఉద్యోగాలు ఇవ్వాలని, సురక్షితమైన తాగునీరు, అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యత నిర్మూలనే లక్ష్యం

ప్రజాశక్తి - సీతానగరం



వాలంటీర్లకు పుస్తకాలను అందిస్తున్న ఎంపిడిఒ

ఉల్లాస్ అక్షర ఆంధ్ర లక్ష్యాలను నెరవేర్చి అందరి వయోజనులను అక్షరా స్యులుగా తీర్చిదిద్దడంలో విద్యావా లంటీర్లు కీలకపాత్ర పోషించాలని ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఎపిఎం భారతి పిలుపునిచ్చారు. మొదటి విడతగా 240మంది వాలంటీర్లకు ఐకెపి, మండల పరిషత్ కార్యాలయాల్లో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం రెండో రోజు శిక్షణ సందర్భంగా వారికి పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఎంపిడిఒ, ఎపిఎం మాట్లాడుతూ గ్రామాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ అక్షర ఆంధ్రలక్ష్యాలను నెరవేర్చడంలో వాలంటీర్లు కీలక పాత్ర పోషించాలన్నారు. ఈనెల 27 నుంచి మీకు మ్యాపింగ్ చేయబడిన నిరక్షరాస్యులను వందరోజుల్లో అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ బాలకృష్ణ, వెలుగు సీసీలు సమైక్య సభ్యులు వాలంటీర్లు పాల్గొన్నారు.

వేతనాల కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి ఇంత వరకు వేతనాలు అందలేదని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు ప్రసాదరావు, రాము, వెంకట్, లక్ష్మణ, తదితరులు గురువారం విలేకరుల వద్ద వాపోయారు. పనులు చేసినప్పటికీ నెలల తరబడి వేతనాలందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కష్టపడి కూలీలకు వేతనాలు అందించలేదని ఉపాధి అధికారుల నిర్లక్ష్యమే ఇలా జరిగిందని, వేతన దారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని వేతన దారులు కోరుతున్నారు.

ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన యువత శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కెవికె శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరాజు అన్నారు. గురువారం మండలంలో కృషి విజ్ఞాన కేంద్రంలో గిరిజన యువతకు జీడి మామిడి, పనస, సపోటాలో అంటుకట్టు విధానం, పోట్రేళ్ల నారు పెంపకం, టమాటా అంటు మొక్కలు జీడి పంటల్లో అంతర పంటల గురించి శిక్షణ ఇచ్చి నైపుణ్యత అభివృద్ధి సాధించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, గిరిజన యువత పాల్గొన్నారు.

ఆలయం ఎదుటే మద్యం సీసాలు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో కోట దుర్గ ఆలయం ఎదురుగా మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. ఆలయ ప్రాంగణంలో బోరు దగ్గర సీసాలు ఉండడంతో పలువురు ముక్కు మీద వేలు వేసుకుంటున్నారు. రాత్రి వేళల్లో ఆలయం దగ్గర ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయా అంటూ పలువురులో చర్చ మొదలైంది. దీనిపైన దేవాదాయ శాఖ, పోలీసులు కూడా దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త కరి శ్రీను తండ్రి సత్యం అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం వారి ఇంటికెళ్లి పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కేవీ కొండయ్య, మాజీ ఏఎంసి చైర్మన్ కోలా రంజిత్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ డోల్లు కిషోర్, బిజెపి జిల్లా జనరల్ సెక్రెటరీ నిమ్మక భాస్కరరావు, మాజీ ఎంపిటిసి మండంగి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అంటిపేట, పనుకుపేటలో గ్రామసభలు

పజాశక్తి - సీతానగరం

మండలంలోని పణుకుపేట, అంటిపేట గ్రామాల్లో ఉపాధి హామీ పథకం 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులకు సామాజిక బృందం తనిఖీలు నిర్వహించి గ్రామసభలో ఆ గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దల సమక్షంలో గ్రామసభ నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందానికి జాబ్ కార్డుల లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మస్తర్లు, కొలతల్లో తేడాలున్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి అంబటి కృష్ణంనాయుడు, మాజీ సర్పంచ్ పైన నాగభూషణం, సర్పంచ్ బొంగు తిరుపతిరావు, పిఎసిఎ అధ్యక్షులు యోగి రెడ్డి భాస్కరరావు, ఎంపిటిసి చలపతి, నిర్మల, బిసి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, ఎస్ఆర్పి రామచంద్రరావు, డిఆర్పి ఎం.నరేష్, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడుకూరుకు చెందిన తాడిఅశోక్కు రూ.89,928, చిట్టపూడి వలసకు చెందిన మోనంగి కౌశిక్కు రూ.42 వేలు సిఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తన క్యాంపు కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం గనుక ప్రజల కోసం పనిచేస్తుందని, వీటిని వినియోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పి.కృష్ణమూర్తి నాయుడు, ఉదయాన ఉదయభాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, చింతా ఉమామహేశ్వరరావు, జనసేన జానీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత

కురుపాం: విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే కాకుండా వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని డిఐఇఒ వై.నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను అకస్మికంగా సందర్శించారు. కళాశాల పరిసర ప్రాంతాలను, వసతులను, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రిన్సిపల్ ఎం.కుమారస్వామి, సిబ్బందికి విద్యార్థుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు అందించారు.

పురోహితునివలసలో ఉచిత వైద్య శిబిరం

సాలూరు : మండలంలోని పురోహితునివలసలో ఉచిత వైద్య శిబిరాన్ని నిహాల్ ఆసుపత్రి వైద్యులు బంకురు అప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 200 మంది రోగులకు ఉచితంగా మందులు, రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను తినే విధంగా ఉండాలని ఎటువంటి సమస్యలు వచ్చినా మూఢనమ్మకాలను నమ్మకుండా వైద్యులను సంప్రదించి తగు వైద్య సలహాలు తీసుకొని మందులను తీసుకోవాలని ఆయన సూచించారు. గ్రామ సర్పంచ్ బంకురు తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

13 గంటల పనితో శ్రమ దోపిడీ

బొబ్బిలి : కార్మికుల శ్రమ దోపిడీ చేసేందుకే రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం రోజుకు 13 గంటల పనివిధానం తీసుకొస్తోందని ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు డి.వెంకటరమణ, టి.అప్పలనాయుడు విమర్శించారు. పట్టణంలోని గంటి ప్రసాదం భవనంలో గురువారం 13 గంటల పని విధానానికి వ్యతిరేకంగా జరిగే నిరసన పోస్టర్లను విడుదల చేశారు. తక్షణమే ఆ నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

దృష్టి దోషాలు రాకుండా జాగ్రత్త

రామభద్రపురం : దృష్టి దోషాలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకొని కంటి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని పిరిడి పిహెచ్సి కంటి వైద్య నిపుణులు సునీత విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురువారం నాయుడువలస ప్రాథమికోన్నత పాఠశాలలో కంటి సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్రాథమిక కంటి పరీక్షలు నిర్వహించారు. ఆరో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో ఇన్ఛార్జి హెచ్ఎం జెసి రాజు, ఆశా వర్కర్ లక్ష్మి పాల్గొన్నారు.

మద్యం నాణ్యత తనిఖీకి మొబైల్ యాప్

గుమ్మలక్ష్మీపురం : ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం కొనుగోలు చేసుకోవచ్చని ఎవరు కూడా ఎటువంటి అపోహలు లేకుండా నాణ్యమైన మద్యాన్ని పొందవచ్చునని కురుపాం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం గుమ్మలక్ష్మీపురం వైన్ షాపును ఆకస్మికంగా పరిశీలించారు. షాపులో ఉన్న మద్యం బాటిల్ పరిశీలించి క్యూఆర్ కోడ్ తో పరిశీలన చేశారు. యాప్ ద్వారా స్కాన్ చేసి మాత్రమే అమ్మకాలు చేయాలన్, నాణ్యతకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే 6302936599కు ఫిర్యాదు చేయాలని సిఐ కోరారు.

వ్యర్థాల తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎట్టకేలకు పట్టణ శివారులో గల డంపింగ్ యార్డ్లో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించి, మిషనరీల ద్వారా వేరు చేసే ప్రక్రియ ప్రారంభమవుతుంది. 15ఏళ్లుగా పర్యావరణానికి హాని కలిగించే వ్యర్థాలు పేరుకుపోవడంతో, డంపింగ్యార్డ్ను వేరే ప్రాంతానికి తరలించేందుకు అటు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయత్నాలు చేసి, లక్షలాది రూపాయలు నిధులను ఖర్చుపెట్టినప్పటికీ ఒక్క అడుగు ముందుకు పడలేదని చెప్పవచ్చు. స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్లో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ స్వచ్ఛ పార్వతీపురంగా తీర్చిదిద్దేందుకు ఈ డంపింగ్ యార్డ్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగింపుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క అడుగు ముందుకు వేసి విశాఖపట్నంకు చెందిన తరుణి అసోసియేట్స్తో గత ఏడాది ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా గత ఏడాది


మిషనరీ పరికరాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

అక్టోబర్ 17న మున్సిపల్ ప్రత్యేక అధికారిగా విజయనగరం కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, పబ్లిక్ హెల్త్ ఇఇ జ్యోతి డంపింగ్ యార్డ్లో పేరుకు పోయిన వ్యర్థాలను పరిశీలించారు. డంపింగ్ యార్డ్లో పేరుకుపోయిన 12 వేల టన్నుల వ్యర్థాల తొలగింపునకు ఒప్పందం జరిగిందని, ఈ తొలగింపు పనులను త్వరలో ప్రారంభిస్తామని చెప్పి ఏడాదైనా వ్యర్థాలు తొలగింపు ప్రక్రియ జరగలేదు. ఏడాది తర్వాత తొలగింపునకు సంబంధించి ఎట్టకేలకు డంపింగ్ యార్డ్ ఎదురుగా ఉన్న ప్రైవేట్ లేఔట్లో మిషనరీ పరికరాలను సంబంధిత సంస్థ ఏర్పాటు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ వ్యర్థాలు నుంచి సోయిల్, ఇనేట్,ఆర్ డి ఎఫ్(పాలిథిన్ వ్యర్థాలు),సి ఎన్ డి స్టోన్లను వేరుచేసే ప్రక్రియ జరుగుతుందని ధరణి అసోసియేట్స్ నిర్వాహకులు చెబుతున్నారు. మొత్తానికి డంపింగ్ యార్డ్ లో దశాబ్ద కాలంగా పెరిగిపోయిన వ్యర్థాల తొలగింపునకు అడుగులు పడుతుండడంతో పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి -భామిని

వైద్య కళాశాలలు 100శాతం ప్రభుత్వం చేతిలో ఉంటేనే సామాన్యుడికి వైద్యం, సామాన్య కుటుంబం నుంచి వైద్యులు తయారవుతారని ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం అన్నారు. భామినిలో మండల వై సి పి అధ్యక్షులు బి.శ్రీనుబాబు ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో, వైద్యం ఎల్లప్పుడూ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉండాలని, అప్పుడే సామాన్యుడికి ఆరోగ్య సేవలు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు, సానుభూతిపరులు, యువకులు పాల్గొని సంతకాలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోనగట్టి ధర్మారావు, కొత్తకోట చంద్రశేఖర్, కోతల మజ్జి, కొల రామారావు, పోతల హరికృష్ణ, గేదెల మోహన్ రావు పాల్గొన్నారు.


విద్యార్థినికి బహుమతిని అందిస్తున్న పిఒ సుగుణకుమారి

హక్కులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

బాలికల రక్షణ కోసం ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులను చట్టాలను వినియోగించుకునే విధంగా అవగాహన కలిగి ఉండాలని కొమరాడ ప్రాజెక్టు ఐసిడిఎస్ పిఒ జి.సుగుణ కుమారి అన్నారు. గురువారం అంతర్జాతీయ బాలికా దినోత్సం సందర్భంగా మండలంలో కేజీబీవీ, కోటిపాం పాఠశాల, మండల గురుకుల విద్యాలయంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పౌష్టికాహారం, ప్రభుత్వం బాలికల రక్షణ కోసం కల్పిస్తున్న హక్కులను వివరించి వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. ఆరోగ్యంగా ఉండాలంటే బాలికలు తీసుకోవాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పిస్తూ వారు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలిపారు. ఈ సందర్భంగా వ్యాసరచన, డిబేట్ నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు శారదంబ, బంగారమ్మ, జిల్లా బాలల సంరక్షణ అధికారి సత్యనారాయణ, కౌన్సిలర్ తవిటినాయుడు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.


అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకే స్మార్ట్ కార్డులు

ప్రజాశక్తి - వీరఘట్టం

అక్రమ దారులకు అడ్డుకట్ట వేసేందుకే కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన చేతులు మీదుగా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తుందని అందులో భాగంగా మండలంలో 19,500 కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని అన్నారు. చౌక ధరల దుకాణం ద్వారా రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా పారదర్శకంగా పంపిణీ చేయడానికి స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా స్మార్ట్ రేషన్ కార్డులు ద్వారా సరుకులు పొందవచ్చు అన్నారు. అనంతరం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలకొండ సబ్ కలెక్టర్ ఎస్పి జగన్నాథ్, జిల్లా సివిల్ సప్లై అధికారి ఎం.బాల సరస్వతి, తహశీల్దార్ ఎఎస్కామేశ్వరరావు, కూటమి నాయకులు పి. కృష్ణమూర్తి నాయుడు, ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బళ్ళబాబు,చింత ఉమామహేశ్వ రరావు, శశి కుమార్, ఏ.కుమార స్వామి, ఎం. వెంకట రమణ, వై.శ్రీనివాసరావు, బి.నీలకంఠం నాయుడు, జనసేన జానీ, ఎం.పుండరకం, ఎస్.అచ్యుతరావు, కె.సాయి పవన్, కె.లక్ష్మణ్, ఎం.వెంకటరమణ, ఎస్ఎస్ భూషణ్రావు బి.అశోక్, పైడిరాజు, రాజ్ కుమార్, చంద్రశేఖర్, విఆర్ఒలు, డీలర్లు, పాల్గొన్నారు.

కొటియా గ్రామాల్లో స్మార్ట్ కార్డులు పంపిణీ

సాలూరు: మండలంలోని గంజాయి భద్ర పంచాయతీలో ఉన్న 13 గ్రామాలకు, సారిక పంచాయతీలోనున్న 14 గ్రామాలకు రెండు సచివాలయాల సిబ్బందితో కలిసి గురువారం లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భందా పంచాయతీ కార్యదర్శి కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి సంక్షేమ అభివృద్ధి పథకాన్ని గిరిజనులకు అందించడానికి సాయిశక్తులా కృషి చేస్తున్నామన్నారు. దీనికోసం స్థానిక అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులను కలుపుకొని వెళుతూ వారికి అందవలసిన అన్ని


వీరఘట్టం: స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పథకాలనూ సక్రమంగా అందిస్తున్నామన్నారు.

గురుగుబిల్లి: మండల పరిధిలోని సంతోషపురంలో స్మార్ట్ కార్డులను సర్పంచ్ అంబటి తవిటినాయుడు (రాంబాబు) గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన ఆయన మాట్లాడుతూ పౌరసర ఫరాల వ్యవస్థలో పారదర్శకంగా ఉండేందుకు క్యూ ఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం అందజేసిందన్నారు. యడం జరిగిందని తెలిపారు. రేషన్ కార్డుల వినియోగదారుల కు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వ్యకాస మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- సాలూరు

ఈనెల 22న పార్వతీపురంలో జరుగు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 10వ జిల్లా మహాసభలు జరగనున్నాయని వాటిని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు కోరారు. గురువారం సాలూరులో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆధ్వర్యంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లల్లో పేదలు గిరిజనుల పక్షాన వ్యవసాయ కార్మిక సంఘం అనేక పోరాటాలు నిర్వహించిందని, ప్రధానంగా భూ సమస్యలపై, ఉపాధి, మైనింగ్ తదితర సమస్యలపై కృషి చేసిందని గుర్తు చేశారు. ఈ మూడేళ్లలో జరిగిన పోరాటాలు ఫలితాలను సమీక్షించుకొని వచ్చే మూడేళ్లకు పోరాటాలు, కార్యక్రమాలను ఈ సభలో రూపొందించు కుంటామని చెప్పారు. జిల్లాలో సంఘం ఆధ్వర్యంలో అనేక భూ పోరాటాలు నడిచాయని దీనికి ప్రతిఫలంగా పేదలు గిరిజనులు భూములు సాధించుకున్నారని, ఉపాధి హామీ చట్టాన్ని


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

రక్షించాలని కూలీలు సమస్యలు పరిష్కారం చేయాలని అనేక పోరాటాలు నిర్వహించి కూలీలకు అండదండగా ఉన్నామని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 22వ తేదీన పార్వతీపురంలో జరిగే జిల్లా మహాసభలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు జన్ని ఈశ్వరరావు, బొంగ కృష్ణ, బూరాడ ఈశ్వరరావు, సింగారపు శ్రీను, చలంబారికి సింహాచలం, లింగాల బంగారి, అంతికాపల్లి చంటి, కుప్పిలి వెంకట్రావు, డర్రు బంగారి తదితరులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కాలనీలో విద్యుత్ స్తంభాలు, రహదారి సౌకర్యం కల్పించాలని, పట్టణ పరిధిలో వెంకటేశ్వర కాలనీవాసులు మున్సిపల్ ఎఫ్ఎసి కమిషనర్ జి.శ్రీనివాస రాజుతో అన్నారు. గురువారం మాజీ మున్సిపల్ చైర్మన్ బి.జయ ప్రకాష్ నారాయణ, టిడిపి నాయకులు సారిక గణేష్లతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కమిషనర్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ వెలసి నాలుగేళ్లు కావస్తున్నా ఇంత వరకు విద్యుత్ స్తంభాలు, రహదారి సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నారని, రాత్రి వేళల్లో విష సర్పాల సంచారం వల్ల ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని, కాలనీలో ఉన్న చిన్నారులు, మహిళలు, వృద్ధులు భయపడుతున్నారని చెప్పారు. ఈ సమస్యను ఏడాది క్రితం మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఇంత వరకు


కమిషనర్కు సమస్యను వివరిస్తున్న నాయకులు

సౌకర్యాలు కల్పించలేదని తక్షణమే ఈ కాలనీలో విద్యుత్ స్తంభాలు వేసి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మాజీ మున్సిపల్ చైర్మన్ చైతన్య స్కూల్ రహదారిలో కూడా విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ కాలనీ వాసులు గౌరీ శంకర్రావు, బి.కృష్ణ, ప్రసాదు, రమణ, మాజీ కౌన్సిలర్ మంచిపల్లి సత్యనారాయణ, పాల్గొన్నారు.

2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం : డిఎస్ఒ

వీరఘట్టం: జిల్లాలోని ఈ ఏడాది 180 కొనుగోలు కేంద్రాల నుండి 2.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా సివిల్ సప్లై అధికారి ఎం.బాల సరస్వతి తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు 104 రైస్ మిల్లులు అనుసంధానం చేశామన్నారు.

చెకుముకి సంబరాలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -వీరఘట్టం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు ప్రతిభ పరీక్షను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ మహేశ్వరరావు, కె.గౌర్నాయుడు, జిల్లా చెకుముకి సబ్ కమిటీ కన్వీనర్ ఆర్.ధనుంజయనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8,9,10 తరగతుల విద్యార్థులు రాసే ఈ సైన్స్ ప్రతిభ పరీక్ష ఈనెల 18న పాఠశాల స్థాయి, నవంబర్ 1న మండల స్థాయి, 23న జిల్లాస్థాయి పరీక్షలు నిర్వహించనున్నామని, డిసెంబర్ 12,13,14 తేదీల్లో రాష్ట్రస్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షలు ఉంటాయని వారు తెలిపారు.


మురుగు నీరు తొలగించిన తరువాత వీధి పరిస్థితి

వరద నీరు తొలగింపు

'ప్రజాశక్తి ' వార్తకు స్పందన

ప్రజాశక్తి - పాచిపెంట

రెండు, మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలు స్థానిక ఆరోగ్య కేంద్రం దారిని వరద నీరుతో ముంచేసింది, దీంతో రోగులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే ముడుకుడు నీటిలోంచి వెళ్లి నరకయాతన పడుతున్నారు. ఈ నేపథ్యంలో పిహెచ్సికి వెళ్లాలంటే నరకమే శీర్షిక మంగళవారం 'ప్రజాశక్తి' లో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఈ మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారిలో నిల్వ ఉన్న మురుగునీటిని మోటార్తో తొలగించి రోగులకు ఇబ్బంది లేకుండా బాగు చేశారు.

బకాయి బిల్లులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకానికి సంబంధించి బకాయి బిల్లులను వెంటనే విడుదల చేయాలని సిఐటియు నాయకులు బచ్చుల సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలుగా మెస్ బిల్లులు జీతాలు చెల్లించకపోవడంతో కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే బిల్లులు, జీతాలు చెల్లించాలన్నారు. కార్మికులపై రాజకీయ వేదింపులు ఆపాలని, ప్రమాద బీమా సౌకర్యం, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కె. సరోజిని, వెంకట పద్మావతి, లెంక సీతమ్మ తదితరులు పాల్గొన్నారు

రాజ్యాంగ దినోత్సవ సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

భారత రాజ్యాంగ దినోత్సవం జయప్రదం చేయాలని అంబేద్కర్ ఇండియా మిషన్ నాయకులు బివి రమణ పిలుపునిచ్చారు. గురువారం ఆయన చంద్రంపేట పరిధి ఎల్ఎన్పురంలో దళితవాడలో పర్యటించి భారత రాజ్యాంగ దినోత్సవం జయప్రదం చేయాలని కోరారు. ఈ నెల 26న నెల్లిమర్లలో భారత రాజ్యాంగ దినోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు వంద డప్పులు, వేయి గొంతులు కార్యక్రమం ద్వారా సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొమ్మలాట రాము, దివకాల సంతోష్, సింహాద్రి, సూరిబాబు, పాల్గొన్నారు.

ముగిసిన పోషణ మాసోత్సవాలు

ప్రజాశక్తి- సాలూరు

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గత నెల 17 నుండి ఈ నెల 16 వరకూ సాలూరులో జరిగిన జరిగిన ఎనిమిదవ రాష్ట్ర పోషణ మాసోత్సవాల కార్యక్రమాలు ముగిశాయి. ముగింపు కార్యక్రమాన్ని సాలూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి కె.మంగమ్మ ఆధ్వర్యంలో గురువారం వైటీసీ భవనంలో పట్టణ, మండల అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ సిబ్బంది ప్రతి గ్రామంలో శిశు పోషణ గురించి ప్రజలకు సరైన అవగాహన కల్పించే విధంగా పిల్లల ఆహారపు అలవాట్లపై శ్రద్ధ వహించడం వల్ల స్థూలకాయం, చక్కెర వ్యాధిని నియంత్రించవచ్చని తెలిపారు. పిల్లలకు సరైన ఆహారం, సరైన పద్ధతుల్లో, సరైన సమయానికి అందిస్తేనే వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని అన్నారు. టాటా ట్రస్ట్ డిసిఒ కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు పిల్లల ఎత్తులు, బరువులు చూసి, వారి ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని


గర్భిణులను ఆశీర్వదిస్తున్న వైద్యులు

సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారు చేసే బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం వైటీసీలో ఉన్న ఐదుగురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు అనురాధ, విజయలక్ష్మి, లీలావతి, ధనలక్ష్మి, లక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

బకాయి వేతనాలు చెల్లించి, మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ గురువారం స్థానిక మండల పరిషత కార్యాలయం వద్ద క్లాప్ మిత్రలు, గ్రామ పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా



నిరసన తెలుపుతున్న కార్మికులు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మలమన్మధరావు, ఆ సంఘం కార్యదర్శి పృధ్వీ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కాపాడిన గ్రీన్ అంబాసి డర్లు పట్ల ప్రభుత్వ అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. గత ప్రభుత్వం మాది రిగానే ఈ ప్రభుత్వం నెలలు తరబడి వేతనాలు బకా యిలు పెడితే తమ కుటుంబాలను ఎలా పోషించుకో వాలని ఆవేదన వ్యక్తం చేశారు, గ్లౌజులు, సబ్బులు, కొబ్బరి నూనె, మాస్కులు లాంటి కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ అలవెన్స్ రూ.4వేలు అమలు చేయాలని, రిక్షా మరమ్మతులు సొంత ఖర్చులతో గ్రీన్ అంబాసిడర్లు చేయించుకుంటున్నారన్నారు. కనీసం పంచాయతీ సెక్రటరీలు బిల్లులు కూడా మరమ్మతులకు చెల్లించడం మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. అనంతరం ఎంపిడిఒకు, డిప్యూటీ ఎంపిడిఒలకు వినతి పత్రం అందజేశారు. సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని పంచాయతీ సెక్రటరీలకు, గ్రీన్ అంబాసిడర్లకు జాయింట్ మీటింగ్ వేస్తామని హామీ ఇచ్చారు. సిపిఎం నాయకులు పి.భాను మూర్తి, శ్రీను, ఫకీరు, ప్రసాదు, సోములు, మరియమ్మ, సంగమేశు, మేరీ, పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ సెమినార్కు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి సైన్స్ సెమినార్లో స్థానిక ఎపి మోడల్ స్కూల్లో పదవతరగతి చదువుతున్న నెల్లి శ్రీనిది మొదటి స్థానంలో నిలిచింది. ద్వితీస్థానం ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి పి.నవీన్కుమార్ సాదించారు. మండల స్థాయిలో ప్రథమ స్థాయి సాదించిన శ్రీనిదిని జిల్లా స్థాయి సైన్స్ సెమినార్కు శుక్రవారం పార్వతీపురం పంపను న్నట్లు ఎంఇఒ ఎన్.సత్యనారాయణ తెలిపారు. విజేతలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకర్రావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



కురుపాం: శ్రీనిధిని అభినందిస్తున్న టీచర్లు

జిల్లా స్థాయి సెమినార్కు ఎంపిక

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలుర)లో గురువారం ఎంఇఒలు డి.గౌర్నాయుడు, ఆర్.ఆనందరావు ఆధ్వర్యంలో క్వాంటం యుగం ఆరంభం, అవకాశాలు, పరిమి తులు టాపిక్కి సంబంధించి మండల స్థాయి సైన్స్ సెమినార్ పోటీలు నిర్వహించారు. మండలంలోని కత్తులకవిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జి చైతన్య ప్రథమ స్థానంలో నిలిచారు. పివిఆర్పురం ప్రాథమిక ఉన్నత పాఠశాలకు చెందిన పి.షర్మిల ద్వితీయ స్థానం సాధించడంతో గైడెన్స్ ఉపాధ్యాయులు జి జేమ్స్ కుమార్, ఎం సంపత్


వీరఘట్టం: ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కుమార్లకు అభినం దనలు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 17వ తేదీన జిల్లా కేంద్రంలోని జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ పోటీలకు ఉదయం తొమ్మిది గంటలకు హాజరుకావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రత్నాకర్, బి. సుంబోరా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఏరియా ఆసుపత్రిని గురువారం ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.విజయ పార్వతి సందర్శించారు. రోగుల పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో జ్వరాలపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆమెతో పాటు మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.